# సంత్ పేయువ్వు

-గుజ్జ సురేష్‌రెడ్డి

ఆ నిజం తెలిసిన క్షణం నుంచీ గజలక్ష్మి ఒళ్లంతా ఎండకాలం తారు రోడ్డులా వేడెక్కి వుంది. 'అమ్మో...అమ్మో! ఎంత మోసం? తెలుగు సినిమాలో విలన్‌లా చేయకూడనిదంతా చేసేసి బుద్ధిమంతుడిలా బిల్డప్‌లు వెలగబెడ్తున్నారా? అయినా నా పిచ్చిగానీ ఎంగిలాకుకి ఎగబడని కుక్క, వరకట్నం వద్దనే పురుషుడు ఉంటారా?' తనలో తానే సణుక్కుంటూ ఆటో ఎక్కింది.

ఎంత తొందరగా ఇంటికెళ్దామా? ఎంత తొందరగా మొగుడు దుమ్ము దులిపేద్దామా అన్న కోపంతో "ఆటో కొంచెం స్పీడుగా పోనీ" అంటూ ఆటోవాడ్ని కంగారు పెట్టసాగింది.

ఆ మాటకు ఆశ్చర్యంతో వెనక్కి తిరిగి చూసాడు ఆటో డ్రైవర్. ఎందుకంటే బండి స్పీడుగా వెళ్తుంటే 'కాస్త మెల్లగా వెళ్లు పర్లేదులే అనే వాళ్లనే చూసాడుగానీ 50 కిలోమీటర్ల స్పీడులో వెళ్తుంటే ఇంకా స్పీడు పెంచమన్న లేడీని తన సర్వీసులో మొదటిసారిగా చూసాడు.

గజలక్ష్మికి మొదటినుంచీ కాస్త అభ్యుదయ భావాలెక్కువ. స్త్రీ పురుషుడ్ని భర్తగా పొందడానికి వరకట్నం ఇవ్వడమనే సంప్రదాయం ఆమెకు సుతరామూ ఇష్టముండేదికాదు. జీవితంలో కన్యగానైనా ఉండిపోతానుగానీ కట్నకానుకలిచ్చి పెళ్లి చేసుకునే ప్రసక్తే లేదని భీష్మించుకు కూర్చుంది.

ముని తపస్సుకు మెచ్చి శివుడు ప్రత్యక్షమయినట్లు నీ ఆదర్శ భావాలు నాకు నచ్చాయంటూ స్వయాన తన బావ గిరీశం తళుక్కున ఊడిపడి "నువ్వూ నేను ఏకమైనాము" అంటూ పాత సినిమా పాట ఒకటి పాడుతూ గజలక్ష్మి మెడలో మూడుముళ్లు వేసేసాడు.

ఇన్నిరోజులు తన అదృష్టాన్ని పదేపదే తలచుకుని మురిసిపోతూ ఉంది. తనకు పరిచయమున్న ప్రతివారితోనూ తన పెళ్లి గురించి, తన భర్త గొప్పతనం గురించి అసందర్భమైనా సరే అవతలివాళ్లకి చెప్తూ ఆనందిస్తూ ఉండేది.

ఈరోజు సూపర్‌మార్కెట్‌లో గిరిజ తారసపడింది. కనిపించడమే ఆలస్యమన్నట్లు టకటకామని ఊకదంపుడు కార్యక్రమం మొదలుపెట్టి అరగంటసేపు మెదడును మేసేసరికి "పనుంది...నేవెళ్తాను" అంటూ తప్పించుకోవాలనుకుంది అక్కడ్నించి గిరిజ.

"అద్సరే మీ చెల్లికి పెళ్లయిందిట కదా? బరువు కూడా భారీగానే ఇచ్చారని విన్నాను. నిజమేనా?" బోనులో ముద్దాయిని లాయర్ ప్రశ్నించినట్లు కళ్లల్లోకి కళ్లు పెట్టి చూస్తూ అడిగింది గజలక్ష్మి.

"ఈరోజుల్లో రిగ్గింగ్ లేకుండా ఎన్నికలు, సిజేరియన్ లేకుండా కాన్పులు, బరువు లేకుండా వివాహాలు జరుగుతాయా చెప్పండి. మీరడగడం కానీ..." ప్రస్తుత పరిస్థితిని భూతద్దంలో చూపిస్తూ చెప్పింది.

"మరి నా విషయంలో ఎలా సాధ్యమైంది?" మెడ పైకెత్తి నగలను సవరించుకుంటూ అదే మరి నా గొప్పతనం అన్నట్లు తల అటూ ఇటూ తిప్పుతూ గర్వంగా అంది.

గజలక్ష్మి ఇస్తున్న బోడి బిల్డప్‌లు చూసి ఒళ్లు మండింది గిరిజకి. ఎలాగైనా నిజం చెప్పి ఏడిపించాలనుకుంది.

"నీకు తెలియదుగానీ అక్కా! నీ నెత్తిన అక్షింతలు పడ్డానికి నీకు తెలియకుండా మీ ఆయనకు మీవాళ్లు బాగానే ముట్టచెప్పారట. నీకు తెలిస్తే ఎక్కడ కాదంటావో అని రహస్యంగా ఉంచారు. తర్వాత్తర్వాత అలా... అలా బయటకు వచ్చేసింది. నిజం తెలీక నువ్వందరిముందు గొప్పలు పోతుంటావు" అని చెప్పింది.

గజలక్ష్మి పరిస్థితి నష్టాల్లో కూరుకుపోయిన షేర్ మార్కెట్‌లా అయిపోయింది. మాడిపోయిన మొహాన్ని చూసి ముసిముసిగా నవ్వుకుంటూ "వస్తానక్కా" అంటూ వెటకారంగా వత్తి పలికి వెళ్లిపోయింది గిరిజ.

గిరిజ పెదవి చాటున నవ్విన నవ్వు గజలక్ష్మి నరనరాల్లోనూ మంటల్ని రాజేసింది.

ఆటో ఇంటి ముందు ఆగింది.

ఇంట్లో శ్రీవారు టెన్‌స్పోర్ట్స్ ఛానల్‌లో డబ్ల్యు.డబ్ల్యు.ఎఫ్ చూస్తున్నాడు. గజలక్ష్మిని చూడగానే "షాపింగ్ కార్యక్రమం పూర్తయిందా?" కాళ్లూపుతూ అడిగాడు.

"ఒకసారి టీవీ ఆపండి" కళ్లెర్రచేసి చెప్పింది గట్టిగా.

"ఏం అదేం చేసింది? ఓ సీరియల్స్ తప్పితే మరే ఇతర ప్రోగ్రామ్స్ మీ ఆడాళ్లకు పట్టవుకదూ" అని తనేదో పెద్ద జోక్ పేల్చినట్లు పకపకా నవ్వాడు. విసురుగా రిమోట్ లాక్కుని ఠప్‌మని టీవీ ఆఫ్ చేసేసరికి శ్రీమతి ఎందుకో కోపంగా వుందని మొహంలో హావభావాలు చూసి గ్రహించాడు.

"ఇంత ఎండలో షాపింగ్‌కు వెళ్లడమెందుకు? ఆ వేడి నామీద వెళ్లగక్కడమెందుకు? చూడు ఎలా కందిపోయావో?" చల్లార్చే ప్రయత్నం చేస్తున్నాడు.

"మాంసం అసలు ముట్టనని మేకపోతునే ఎత్తుకుపోయిందిట వెనకటికో నక్క. అలా వుంది మీరు చేసిన నిర్వాకం."

"నేనేం చేసాను" చూపుడు వేలుని చెంపపై ఆడిస్తూ ఆలోచించసాగాడు.

"కేవలం నేనంటే ఇష్టపడేకదా నన్ను చేసుకున్నానని చెప్పారు."

"అవునూ"

"నానుంచి రూపాయి కూడా ఆశించడంలేదని అన్నారా? లేదా?"

"అన్నాను."

"నాకు తెలియకుండా నాలుగులక్షలు తీసు

కుని నా ఆశయాన్ని, ఆత్మాభిమానాన్ని నట్టేట ముంచారు. ఔనా?''

ఈసారి గిరీశం నోటి వెంట సమాధానం అంత త్వరగా బయటకు రాలేదు. ఏం చెప్పాలా అని మాటలు వెతుక్కోసాగాడు.

"మీరేమీ నీళ్లు నమలక్కర్లేదు. మీరు నీటిలో మంటలేయగల సమర్థులని ఇప్పుడే తెలిసింది. ఇంత మోసం చేయడానికి సిగ్గుగా లేదూ'' విసురుగా అంది.

"ఆ...తీసుకున్నాను. అయితే ఏంటట? ప్రపంచంలో నేనొక్కడినేనా ఆ పని చేసింది. నేనేదో రక్షణ శాఖ రహస్యాలు అమ్ముకుని దేశద్రోహం చేసినట్లు అలా గద్దిస్తావేం? ఎంతెక్కువ తెచ్చుకుంటే సమాజంల అంత గొప్పగా అనుకుంటారు, అలాగాక మడికట్టుకుని కూర్చుంటే చేతకాని వెధవనుకోరా. ఐనా నువ్వు సంతోషంగా ఉండాలనేగా మీవాళ్లు ఇచ్చింది'' ఎలాగోలా దబాయించి మేటర్ మూసేద్దామనుకుంటున్నాడు.

అంతటితో వదిలేసే రకం కాదు గజలక్ష్మి. వెంటనే "మీ కష్టార్జితంతో పోషించలేరా? లేకపోతే చికెన్‌గున్యా వచ్చి కాళ్లూ చేతులు పడిపోయాయా?'' అంది.

"అబ్బా... అయిపోయిన పెళ్లికి బాజాలు వాయించడమెందుకు? అన్నం పెట్టు... ఆకలవుతోంది'' అంటూ డైనింగ్‌టేబుల్ వద్దకు వెళ్లి కూర్చున్నాడు.

"పెడతాను. భార్యగా మీకేమి సపర్యలు చేయాలో అన్నీ చేస్తాను. కానీ ముందు నాలుగులక్షలు వెనక్కివ్వండి'' హుకుం జారీ చేసింది.

"వెనక్కివ్వాలా... న్యూస్ ఛానల్ నిండా యాడ్స్ కనిపించినట్లు తాటికాయంత నీ తలకాయలో బూజు తప్ప విషయమేమీ కనిపించడం లేదు'' పెదవి విరిచాడు.



"మీరెలా అనుకున్నా ఫర్వాలేదు. నేను చెప్పిన మాటకి ఒప్పుకుంటే సరే సరి. లేదంటే ఈ రోజు నుండి...కాదు ఈ క్షణం నుండి ఫుడ్ కట్, బెడ్ కట్, డైలాగులు కట్... ఆలోచించుకోండి'' వార్నింగ్ ఇచ్చింది.

'పిచ్చిమొహంది... నాలుగురోజులు ఆగితే అదే దారిలోకి వస్తుంది. అది చెప్పినట్లు వినడానికి నేనేమైనా వెర్రివెధవనా?' అని తనలో తానే ముసిముసిగా నవ్వుకున్నాడు.

***

అప్పటి నుండి ఉద్యమాన్ని ఉధృతం చేసింది గజలక్ష్మి. గిరీశం నానా అవస్థలు పడుతున్నాడు. ఇంట్లో తనొక్కతే వంట చేసుకుని రకరకాల కూరలు, వేపుళ్లతో సుష్టుగా తింటోంది. అలా తనెదురుగా తింటుంటే గిరీశంకు నోరూరుతోంది. పాకశాస్త్రంలో నలుడ్ని పోలినట్లుగా వుంటాయి శ్రీమతి చేసే వంటలు. అలాంటిది భోజనంతోపాటు కాఫీ, టిఫిన్లకు కూడా హోటల్స్‌నే ఆశ్రయించాల్సి రావడంతో రోజూ తినలేక నాలుక మొరాయిస్తోంది.

పోనీ ఏదైనా చెప్పి ఒప్పిద్దామంటే ఏం మాట్లాడినా వినబడనట్లే పోవడం, ఏమడిగినా నోరు విప్పి సమాధానం చెప్పకపోవడంతో సరదాగా కబుర్లు చెప్పుకునే కార్యక్రమం కూడా కరువైపోయింది. ఒంటరిగా కూర్చుని ఉండలేక, అస్తమానం టీవీ చూస్తూ కూర్చోలేక కుడితిలో పడ్డ ఎలుకలా గింజుకుంటున్నాడు. ఏమైనా కోపం ఆపుకోలేక గట్టిగా అరిస్తే నాలుగులక్షలు వెనక్కిచ్చేయమన్నట్లు చేతి నాలుగువ్రేళ్లను ఎత్తి చూపిస్తుంది.

***

నెల గడిచింది. పట్టిన పట్టు విడువలేదు. తన భార్యని కొట్టాలన్నంత కోపం వుంది. కానీ కొడితే తిరిగి ఎక్కడ కొడుతుందో, గుండ్రాయిలాంటి దాని దెబ్బ తగిలితే ములక్కాయలాగా వున్న తను మళ్లీ కోలుకోగలనో లేదో అని ఆగ్రహాన్ని బలవంతంగా అణిచేసుకుంటున్నాడు.

ఓ రోజున ఎవరివో మాటలు వినబడుతుంటే ఆశ్చర్యంతో ద్వారంవద్దే ఆగిపోయాడు. లోపలికి తొంగి చూస్తే ఓ పదిమంది లేడీస్ కూర్చుని ఉన్నారు. సరిగ్గా తేరిపార చూసి ఒక్కక్షణంపాటు షాకయ్యాడు. వాళ్లందరూ తమ వీధిలోనివారే. కాకపోతే వాళ్లందరూ వచ్చిన పనేంటో అర్థం కాలేదు.

మెల్లగా వెళ్లి అందరినీ పలకరించి తనుకూడా ప్రక్కనే కూర్చున్నాడు. ఇంతలో గజలక్ష్మి అందరికీ కాఫీ ఇచ్చి వాళ్లతోపాటు గిరీశానికి కూడా కాఫీ ఇచ్చింది.

కళ్లు ఆల్చిప్పల్లా అంతంత చేసుకుని ఆశ్చర్యపోయాడు. 'తను మారినట్టుంది. బహుశా ఆ విషయం చెప్పడానికే వీళ్లందర్నీ పిలిచి వుంటుంది' నూనెలో వేగిన పూరీలా పొంగిపోతున్నాడు.

"మీరంతా నన్ను క్షమించాలి. మావారు పురుషోత్తములనీ, అదనీ ఇదనీ తెగ గొప్పలు చెప్పాను. కానీ నన్ను మోసం చేసి నాలుగు లక్షలు నొక్కేసారని ఈమధ్యే తెలిసింది'' అంది.

గిరీశానికి తాగుతున్న కాఫీ గొంతుక్కి అడ్డంపడింది. అందరూ అతనివైపు గుడ్లప్పగించి చూస్తుంటే సిగ్గుతో తలొంచుకుని, దుఃఖం దిగమింగి ఇంత అక్కడ ఉండలేక చటుక్కున లేచి బెడ్రూమ్‌లోకి వెళ్లబోతుంటే-

బెడ్రూమ్ డోర్‌కి 'విద్యలేనివాడు వింత పశువు-కట్నం తీసుకునేవాడు సంత పశువు' అని లేబుల్ అంటించి వుంది.

దుఃఖంతోపాటు కోపం ఎగదన్నుకొచ్చింది. 'రాక్షసి చంపుకు తినేస్తోంది' అని గబగబా ఆ పేపరును చింపి నమిలి మింగేసాడు.

***

ఉదయం లేచి చూసేసరికి ఇల్లంతా లేబుల్స్ అంటించి ఉన్నాయి. బుర్ర వేడెక్కిపోతోంది. వీధిలోకి వెళితే 'ఏంటయ్యా...నాలుగు లక్షలు తెలివిగా లాగావంట. భార్యని బాధపెట్టడానికి మనసెలా వచ్చింది' అని నలుగురు నలభై రకాలుగా అడిగి చంపుతున్నారు. ఇంట్లోనేమో ఈ పెంట...ఛీ...వెధవ జీవితం!' తల పట్టుకున్నాడు. ఈ టార్చర్‌ను భరించడం నావల్లకాదు అని వెంటనే అత్తామామలకు ఫోన్ చేసాడు వెంటనే రమ్మని.

వాళ్లు రాగానే బ్రీఫ్‌కేస్ తీసుకెళ్లి వాళ్లచేతుల్లో పెట్టాడు.

"కట్నం తీసుకోవడం ఎంత బుద్ధితక్కువ వ్యవహారమో ఇప్పుడు తెలిసింది. ఎవరైనా ఏ అమ్మాయిని చేసుకుంటే ఎంత ఆస్తి కలుస్తుంది అని ఆలోచించరాదు. ఎలాంటి అమ్మాయిని చేసుకుంటే హేపీగా ఉండగలమో తెల్సుకోవాలని ఇప్పుడు తెలిసింది. దేవుడి దయవలన నాకు మంచి భార్య దొరికింది. అది చాలు'' అన్నాడు పరివర్తన చెందిన మనసుతో గిరీశం.

భర్తలో వచ్చిన మార్పుకి మనసారా సంతోషపడింది గజలక్ష్మి. ★



## ముందుజాగ్రత్త

దేవదాసు, పోకిరి సినిమాల్లో తన గ్లామర్‌తో కుర్రకారుని ఉర్రూతలూగించిన ఇలియానా మూడో సినిమా 'ఖతర్నాక్' ఆ క్రేజ్ అమాంతం పడిపోయేలా చేసిందనేది లేటెస్ట్ సినీ టాక్. 'ఖతర్నాక్'లో ఇలియానా అందాలు మరీ వల్గర్‌గా 'ఆరబెట్టింది' అనేది అంతా చెప్పుకుంటున్న విషయం. ఓ జూనియర్ ఆర్టిస్టు కంటే అధ్వాన్నమైన డ్రెస్సింగ్‌లతో తక్కువ స్థాయి గెటప్‌లో కనిపించడం 'ఖతర్నాక్' సినిమా పరాజయంలో ప్రముఖ పాత్ర పోషించిందని చెప్పుకోవడం విచారకరం. ఈ సినిమా దర్శకుడ్ని పూర్తిగా నమ్మడం వల్లే తన ఇమేజ్‌కి ఇంతగా నష్టం కలిగిందని ఇలియానా వాపోతోంది.

